nipuna
Every Wednesday Free Supplement
05.
16 అక్టోబర్ 2024
పేజీలు 8

### యూరో విజేత స్పెయిన్

యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను స్పెయిన్ గెలుచుకుంది. బెర్లిన్‌లో జులై 15న జరిగిన ఫైనల్లో 2-1తో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఈ టోర్నీలో స్పెయిన్ 15 గోల్స్ చేసి 1984లో ఫ్రాన్స్ 14 గోల్స్ చేసిన రికార్డును అధిగమించింది. జులై 14న 17వ పుట్టినరోజు చేసుకున్న స్పెయిన్ క్రీడాకారుడు లమినె యమాల్ అతిపిన్న వయసులో ఈ టోర్నీ నెగ్గిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఈ టోర్నీలో లమినెకు 'బెస్ట్ యంగ్ ప్లేయర్' అవార్డు దక్కింది. నాలుగు యూరో టైటిళ్లను గెలిచిన స్పెయిన్ జర్మనీ (3) రికార్డును అధిగమించింది.

# సమాచార విప్లవం.. మానవ వనరుల నైపుణ్యానికి ప్రతిబింబం

## సమ్మిళిత మానవ వనరుల అభివృద్ధి



- ప్రపంచ వ్యాప్తంగా మానవ వనరులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అత్యధిక యువ జనాభాను కలిగి ఉన్న భారతదేశం తన మానవ వనరులకు నైపుణ్యాలను చేర్చగలిగితే 2047 నాటికి వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన భారతదేశం) లక్ష్యాన్ని సులువుగా సాధించగలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2024-25 బడ్జెట్‌లో మూడో ప్రాధాన్యతా అంశంగా సమ్మిళిత మానవ వనరుల అభివృద్ధి సామాజిక న్యాయం అంశాన్ని చేర్చడం వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఒక మార్గమని భావించవచ్చు. దేశంలోని ప్రతి వ్యక్తి ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా ఉంటూ ఆర్థికాభివృద్ధి ఫలాలను పొందడానికి 2024-25 బడ్జెట్‌లో విద్య, ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధి కోసం రూ.1.48 లక్షల కోట్లు కేటాయించారు.
- చరిత్ర గతిని పరిశీలిస్తే దేశాల ఆర్థికాభివృద్ధి వేర్వేరు దశల్లో జరిగిందని అవగతమవుతుంది. వ్యవసాయాన్ని యాంత్రీకరించడం మొదలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వరకు ఆర్థిక రంగంలో వేగవంతమైన మార్పులు సంభవించాయి. భవిష్యత్తులో మరిన్ని నూతన ఆవిష్కరణలు వెలుగులోకి రానున్నాయి. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ వంటి దేశాలు అతి తక్కువ కాలంలో వేగంగా అభివృద్ధి చెందడానికి సమ్మిళిత మానవ వనరుల అభివృద్ధి భావన ప్రధానంగా దోహదపడింది. దాదాపు నాలుగు దశాబ్దాల కిందట అల్విన్ టాఫ్లర్ రాసిన ది థర్డ్ వేవ్ గ్రంథంలో మానవాళి చరిత్రను ప్రధానంగా మూడు తరంగాలు (అలలు) లేదా మూడు కాలాలుగా విభజించాడు. మొదటిది వ్యవసాయ విప్లవం, రెండో ది పారిశ్రామిక విప్లవం, మూడోది సమాచార విప్లవం. సమాచార విప్లవం మానవ వనరుల నైపుణ్యానికి ప్రతిబింబం. రెండో ప్రపంచ యుద్ధానంతరం సమాచార సాంకేతిక పరిజ్ఞానం వాణిజ్యీకరణ జరగడంతో సమాచార విప్లవం మొదలయ్యింది. నాలెడ్జ్ ఎకానమీలో యంత్రాల సామర్థ్యం కంటే మానవ మనస్సు, మేధాశక్తి సామర్థ్యాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది మానవ వనరుల కేంద్రంగా ఉంటుంది.
- సమాచార సాంకేతిక రంగం ఆధారంగా కొనసాగుతున్న సామాజిక క్రమ వికాసంలో దైనందిన జీవితంలో మనం వాడే ప్రతి వస్తువులో, పొందే ప్రతి సేవలో నాలెడ్జ్ అనేది ఒక అంతర్భాగ అంశంగా ఉంటుంది. టైం, స్పేస్‌తో సంబంధం లేకుండా నాలెడ్జ్ అనేది మరో ఎంటిటీ (అస్తిత్వం)లా పరిణామం చెందింది. ఆర్థికాభివృద్ధికి నాలెడ్జ్ కేంద్ర బిందువైంది.
- వైజ్ఞానిక ఆర్థిక వ్యవస్థ విజ్ఞాన గ్రాహకశక్తి (సెన్సింగ్), విజ్ఞాన సమీకరణ (మొబిలైజింగ్), ఆచరణ (ఆపరేషన్) వంటి రూపాల్లో కొనసాగుతున్నది. వీటన్నింటికి కావాల్సిన శక్తిసామర్థ్యాల కలయికను నిర్వహణా సామర్థ్యం (ఆర్గనైజేషన్ క్యాపబిలిటీస్) అంటారు. వైజ్ఞానిక ఆర్థిక వ్యవస్థలో నిర్వహణా సామర్థ్యాన్ని మానవ వనరుల విభాగం సృష్టించాల్సిన అవసరం ఉంది. మారుతున్న పరిస్థితుల్లో సంప్రదాయక రూపాన్ని వదిలేసి కొత్త గతిశీల పాత్రలో సామర్థ్యాలను నిర్వహించాలి. మానవ వనరుల నిర్వహణలో విజ్ఞానాన్ని ఒక చోటుకు చేర్చే కార్యనిర్వాహకుడిగా (స్టీవార్డ్) విజ్ఞానాన్ని భద్రపరిచే ఫెసిలిటేటర్‌గా, లెర్నింగ్, షేరింగ్ చేసుకొనే రిలేషన్‌షిప్ బిల్డర్‌గా అన్నిరకాల మనుషులతో పనిచేయగల స్పెషలిస్టుగా ఏకకాలంలో అనేక పాత్రలను నిర్వహించాలి.
- మానవ వనరుల మార్కెట్ వ్యవస్థలో మేధోసంపదను అమ్మవచ్చు, కొనవచ్చు. నూతన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తువులు సేవల కంటే విజ్ఞానమే కీలక విభాగం. డాన్ టాప్‌స్కాట్ పేర్కొన్నట్లు మేధస్సు ద్వారానే విలువను జోడించడం సాధ్యమవుతుంది. వైజ్ఞానిక ఆర్థిక వ్యవస్థ ప్రపంచ విజ్ఞాన ఆధారమైన సంస్థను సృష్టించింది. ఈ ప్రపంచాన్ని ఏకీకృత మార్కెట్‌గా మార్చివేసింది. ఈ మార్పునకు మానవ వనరుల నిర్వహణ కేంద్ర బిందువయ్యింది.
- 11వ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాల సాధనకు సమన్వయంతో కూడిన చర్యల ద్వారా నైపుణ్యాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పించారు. వివిధ రంగాల్లో ఉపాధికి తగిన నైపుణ్యాలను కలిగిన నిపుణులను తీర్చిదిద్దడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. మానవ వనరులు, నైపుణ్యాల అభివృద్ధికి ప్రధాన మంత్రి ఆధ్వర్యంలోని జాతీయ మండలి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి ఆధ్వర్యంలోని జాతీయ నైపుణ్యతల అభివృద్ధి సమన్వయ మండలి అదేవిధంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ నైపుణ్యతల అభివృద్ధి కార్పొరేషన్ వంటి సంస్థలు అనేక విధాలుగా కృషి చేస్తున్నాయి.
- నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన మండలిలో కేంద్ర మంత్రివర్గంలోని కీలక ఆర్థిక మానవ వనరులు, భారీ పరిశ్రమలు-పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, గ్రామీణాభివృద్ధి, గృహకల్పన, నగరాల్లో పేదరిక నిర్మూలన, కార్మిక మంత్రిత్వ శాఖల మంత్రులు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షులు, నైపుణ్య అభివృద్ధి రంగంలో నిపుణులైన మరో ఆరుగురు సభ్యులుగా ఉంటారు. ఈ మండలి ప్రధానంగా నైపుణ్యాల అభివృద్ధికి మానవ వనరుల వికాసానికి అవసరమైన విధాన లక్ష్యాలను నిర్వచించడం, పరిపాలన ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన నమూనాలను రూపొందిస్తారు.

గ్రూప్-1 ప్రత్యేకం
జనరల్ ఎస్సే

- దేశంలో ఉన్న యువత మానవ వనరులను వెలుగులోకి తేవడానికి నైపుణ్యాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వంలోని 17 మంత్రిత్వ శాఖలు, జాతీయ నైపుణ్యాల అభివృద్ధి కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యల మధ్య సమన్వయం సాధించడానికి ఏర్పాటు చేసిన జాతీయ నైపుణ్యాల అభివృద్ధి సమన్వయ మండలి సమ్మిళిత మానవ వనరుల అభివృద్ధిలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నది.
- జాతీయ నైపుణ్యాల అభివృద్ధి సమన్వయ మండలి ప్రధానంగా నైపుణ్యాల అభివృద్ధికి ప్రధాన మంత్రి నేతృత్వంలోని జాతీయ మండలి తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి అవసరమైన తగిన సలహాలు, సూచనలు అందజేయడం, నైపుణ్యాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో ఉన్న ప్రాంతీయ, సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములయ్యే విధంగా ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను నేర్చుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ఈ మండలి ప్రధానంగా దృష్టి సారించింది.
- కంపెనీల చట్టం-1956లోని సెక్షన్ 25 ప్రకారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో భాగంగా జాతీయ నైపుణ్యాల అభివృద్ధి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. రూ.10 కోట్లు ఈక్విటీ సామర్థ్యంతో ప్రారంభించిన ఈ కార్పొరేషన్‌లో ప్రభుత్వ రంగం వాటా 49 శాతం కాగా ప్రైవేట్ రంగం వాటా 51 శాతం. మానవ వనరుల అభివృద్ధిలో ప్రైవేట్ రంగాన్ని ప్రధాన భాగస్వామిగా చేయాలన్న లక్ష్యంతో ఈ కార్పొరేషన్ అనేక కార్యక్రమాలను చేపట్టింది.
- మానవ వనరుల అభివృద్ధి అనేది ప్రతి ఒక్కరు తమ శక్తిని గుర్తెరిగి పనిచేసేలా చేస్తుంది. మానవ వనరుల అభివృద్ధి అనేది సంప్రదాయక విద్య నుంచే ప్రారంభమై నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ. మానవ వనరుల అభివృద్ధికి, వాటి సమర్థ వినియోగానికి అవసరమైన ప్రధాన సాధనాల్లో విద్య ఒకటి. నైపుణ్యం లేని వారిని నిపుణులుగా తీర్చిదిద్దడంలో పాటు ఉపాధి అవకాశాల కల్పనకు కూడా వృత్తి విద్య అనేక విధాలుగా దోహదపడుతుంది. ఆర్థికవృద్ధికి ఉన్నతస్థాయి నైపుణ్యం అత్యంత అవసరం. అయితే నైపుణ్యాల కొరత అనేది భారతదేశ ప్రగతి క్రమాన్ని బలహీనపరుస్తున్నది. ఇది దేశానికి అతిపెద్ద సవాలుగా మారుతున్నది. ఈ నేపథ్యంలో 2024-25 బడ్జెట్‌లో దేశంలో ఉపాధి కల్పన, నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను రెండో ప్రాధాన్యత అంశంగా గుర్తించారు.
- భారతదేశ జనసంఖ్యాపరమైన లబ్ధి (డెమోగ్రాఫిక్ డివిడెండ్) వంటి గణనీయమైన ప్రయోజనాలను అందించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు అనేక అధ్యయనాల్లో వెల్లడయ్యింది. అందువల్ల నైపుణ్యాలపరంగా, ఉపాధి అవకాశాల పరంగా ప్రాంతీయ అసమానతలు, నిరుద్యోగం వంటి సమస్యలను పరిష్కరించి సమ్మిళిత మానవ వనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశంలో జనాభాపరమైన ప్రయోజనాన్ని ఉపయోగించుకోవడానికి, సమ్మిళిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి ఐదు సంవత్సరాల్లో దేశంలోని 4.1 కోట్ల మంది యువతకు ప్రయోజనం కలిగే విధంగా రెండు లక్షల కోట్ల రూపాయల కేటాయింపుతో ఐదు పథకాలు, ఇతర కార్యక్రమాల కోసం ప్రత్యేకమైన ప్యాకేజీని రూపొందించారు.
- ఉద్యోగంతో సంబంధం కలిగిన ప్రోత్సాహక పథకం (ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్-ఎ) ద్వారా దేశంలోని 2.1 కోట్ల మంది యువతకు నెలకు రూ. లక్ష వరకు వేతనంతో ఉద్యోగం పొందే అవకాశం లభిస్తుంది. ప్రభుత్వం నెల వేతనం రూ.15 వేల వరకు మూడు విడతలుగా నేరుగా ఉద్యోగి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. అదేవిధంగా స్కీమ్-బి పథకం ద్వారా తయారీ రంగంలో మొదటిసారి 30 లక్షల మంది యువతకు ఉపాధిని కల్పిస్తారు. స్కీమ్-సి పథకంలో భాగంగా అన్ని రంగాల్లో కనీసం 50 లక్షల మందికి ఉపాధిని కల్పించే విధంగా కార్యాచరణను రూపొందించారు.
- ప్రధాన మంత్రి ప్యాకేజీలో భాగంగా ఐదు సంవత్సరాల్లో దేశంలోని 20 లక్షల మంది యువత నైపుణ్యాభివృద్ధి కోసం రూ.60 వేల కోట్లతో కేంద్ర ప్రాయోజిత పథకం (సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం) ప్రారంభించనున్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు వరుసగా రూ. 30 వేల కోట్లు, రూ. 20 వేల కోట్లు, రూ. 10 వేల కోట్లు సమకూర్చనున్నాయి. ఈ పథకంలో భాగంగా పరిశ్రమల సహకారంతో హబ్ అండ్ స్పోక్ నమూనాల్లో వెయ్యి ఐటీఐలను అభివృద్ధి చేస్తారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐల్లో శిక్షణ కార్యక్రమాలను ఆధునీకరిస్తారు. అదేవిధంగా ఐటీఐలో శిక్షకులకు శిక్షణ అందించేందుకు ఐదు జాతీయ సంస్థల సామర్థ్యాన్ని కూడా పెంచుతారు.
- ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకంలో భాగంగా దేశంలోని అగ్రశ్రేణి సంస్థల్లో ఉద్యోగ శిక్షణల ద్వారా 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సుగల కోటి మంది యువతకు ఐదు సంవత్సరాల్లో నైపుణ్యాలను అందిస్తారు. శిక్షణార్థులకు ఒక సంవత్సరం పాటు నెలకు రూ.5 వేల భత్యాన్ని అందిస్తారు. సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో శిక్షణ ఖర్చును భరిస్తాయి. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, శిశు సంరక్షణ కేంద్రాలు, విద్యా రుణ పథకాలను 2024-25 బడ్జెట్‌లో ప్రవేశ పెట్టారు.

- దేశంలో భారీ సంఖ్యలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులను సంఘటిత రంగంలోకి తీసుకురావడం 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో కీలక అంశం. అసంఘటిత రంగంలోని కార్మికుల వివరాలను నమోదు చేయడానికి ప్రారంభించిన మొదటి జాతీయ డేటా బేస్ 'ఇ-శ్రమ్ పోర్టల్'లో దేశంలోని దాదాపు 38 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికుల వివరాలను నమోదు చేయాలని లక్ష్యంగా ఎంచుకొన్నారు. 'శ్రమ్ సువిధ', 'సమాధాన్' పోర్టళ్లను పునరుద్ధరించి మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- భవిష్యత్తులో ఉపాధి కల్పనా పరంగా గణనీయమైన మార్పులు సంభవించే అవకాశముంది. ఆటోమేషన్, కృత్రిమ మేధ, గిగ్ ఆర్థిక వ్యవస్థ వంటివి కీలక పాత్ర పోషించనున్నాయి. వీటి వల్ల కొత్త ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు సవాళ్లు కూడా ఎదురుకానున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా రాబోయే 5 సంవత్సరాల్లో దాదాపు 23 శాతం ఉద్యోగాలు మార్పు చెందే అవకాశముందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక-2023లో పేర్కొన్నది. రాబోయే రోజుల్లో 10.2 శాతం ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉండగా, 12.3 శాతం ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. అందువల్ల భవిష్యత్తులో రాగల మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ఉద్యోగాలు పొందడానికి సిద్ధంగా ఉండాలి.
- డిజిటల్ ఇండియా, ఫిన్‌టెక్ నేషన్', 'స్టార్టప్ ఇండియా' లక్ష్యసాధన దిశగా డిజిటల్ రంగంలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి పెట్టుబడులను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఫలితంగా మరిన్ని ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. వీటన్నింటి ఫలితంగా సమ్మిళిత మానవ వనరుల అభివృద్ధికి, దేశ సమగ్ర అభివృద్ధికి మార్గం సుగమం కానున్నది.

నూతనకంటి వెంకట్
పోటీ పరీక్షల నిపుణులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827

